www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 సెప్టెంబర్ 2024
5
వైఎస్ఆర్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలు, ప్రగతిని జిల్లా ప్రజలకు తెలియచేజేసేందుకు 'ఇది మంచి ప్రభుత్వం', అలాగే స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ -2047 కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అంతటా గ్రామసభలు నిర్వహిస్తున్న సందర్భంగా 23న జరగాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని తాత్కాలిక రద్దు చేశామని తెలిపారు. జిల్లా అధికారులు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, పంచాయతీ సెక్రెటరీలు, ఇతర అధికారులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

అర్ధాంతరంగా ఆగిన లిఫ్ట్ పనులు

2008 నుంచి పనులు సాగతీత
వెయ్యి ఎకరాలకు అందని సాగునీరు
ఇబ్బందులు పడుతున్న రైతులు

మోటార్ల ఏర్పాటుకు నిర్మించిన గది

అసంపూర్తిగా నిలిచిపోయిన పంప్ హౌస్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణ పనులు 2009 సంవత్సరంలో రత్న కన్స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించారు. కంపెనీ లాభసాటికి ఉన్న పనులు మాత్రమే చేసి మిగిలినవి అర్ధంతరంగా వదిలేశారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారుతున్నా పనులు మాత్రం పూర్తిగాకపోవడంతో రైతులు నేటికీ సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 93 - ఏ ప్యాకేజ్‌లో భాగంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ వెంకటంపల్లి సమీపంలో పంపు హౌస్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి నీటిని లిఫ్ట్ చేసి గురజాలలోని 1000 ఎకరాలకు సాగునీటి అందించాలని దాదాపు రూ. 4 కోట్ల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. రెండు 60 హెచ్‌పి సామర్థ్యం కలిగిన భారీ మోటార్లను అమర్చి పైపులైన్ ద్వారా ఒక కిలోమీటర్ అనంతరం మినీ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి రైతుల పొలాలకు నీటిని సరఫరా చేస్తారు. అయితే పంపు హౌస్ నిర్మాణం 50 శాతం మాత్రమే పూర్తయింది. విద్యుత్‌కు సంబంధించి 24 గంటల నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్తు లైను సబ్ స్టేషన్ నుంచి పంప్ హౌస్ వరకు ఏర్పాటు చేశారు. మిగిలిన పనులు నేటికీ నోచుకోలేదు. గతంలో నీటి పంపింగ్‌కు సంబంధించి పైపులు ఏర్పాటు చేశారు. తరువాత కాంట్రాక్టర్ తిరిగి వాటిని ఎత్తుకు వెళ్లారు. ఆ పనులను పూర్తి చేస్తే 1000 ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందించే అవకాశం ఉంది.

కృష్ణా జలాలతో నిరంతరం కాలువల్లో నీరు..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి) పరిధిలో కాలువలకు ఇటీవల కాలంలో కృష్ణా జలాలు రావడంతో నీరు రైతుల అవసరాల మేరకు నిరంతరాయంగా విడుదల చేస్తున్నారు. గతంలో తుంగభద్ర నీరు అరకొరగా వస్తుండడంతో కాలువలకు సక్రమంగా నీరు వచ్చేవి కావు. ఇటీవల గండికోట ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా చిత్రావతి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 10 టిఎంసిలు కాగా 9.5 టిఎంసిల వరకు నీటిని నిల్వ చేస్తున్నారు. దీంతో పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈ నేప థ్యంలో లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే మరో వెయ్యి ఎకరాలకు సాగునీరును విడుదల చేసే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు అధికారులు చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్ట్ పనులు పూర్తిచేస్తే ఎంతో ఉపయోగం..

అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుని లిఫ్ట్ పనులు త్వరగా పూర్తిచేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. దాదాపు 1000 ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా వచ్చే అవకాశం ఉంది. కావున అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పెండింగ్ పనులను పూర్తి చేయాలి.

-మురళీమోహన్, రైతు, గురజాల.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 93- ఏ ప్యాకేజీ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ పనుల స్టేటస్‌ను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఈ లిఫ్ట్ పనులు దాదాపు 50 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త ప్రతిపాదనలు తయారు చేశాం.

-రాజశేఖర్, ఇఇ, పిబిసి,పులివెందుల.

పారదర్శకతకు పెద్దపీట

నర్సింగ్ ప్రమోషన్లపై నిశిత పరిశీలన
త్వరలో పెండింగ్ ప్రమోషన్లపై నిర్ణయం
రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నర్సింగ్ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం. స్టాఫ్‌నర్సులు, ఎంపిహెచ్‌ఓ వంటి రిక్రూట్‌మెంట్, ప్రమోషన్ల అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేదు. రీజియన్ పరిధిలో వైద్య సేవల్లో మెరుగుదలకు కృషి చేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలతో ముందుకెళ్లే విధంగా నియామకాలు చేపడుతున్నాం. భవిష్యత్ రిక్రూట్‌మెంట్‌ల్లో దరఖాస్తు దారుల సర్టిఫికెట్లను యూనివర్శిటీ ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం పారదర్శకంగా నియామకాలు చేపడతామని పేర్కొంటున్న రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసులుతో ముఖాముఖి...

జోన్-4 పరిధిలోని విభాగాలు, ఉద్యోగులు సంఖ్య ఎంత?

జోన్-4 పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో 3, 800 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఎంపిహెచ్ఇఒ ఎంపి హెచ్‌ఎస్, హెచ్ఇసి, ఎంఎల్‌హెచ్‌పి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, తాజాగా ఫార్మసిస్టులను కూడా కలపడంతో విస్తృతి పెరిగింది. వీరందరి సర్వీసులు, రిక్రూట్‌మెంట్లు, బదిలీలు, వైద్య ఆరోగ్యానికి సంబంధిత స్కీముల అమలు తీరును పరిశీలన చేయాల్సి ఉంటుంది.

ముఖా ముఖి..

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది?

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ లేదు. డిసెంబర్ మూడవ వారంలో సుమారు 40 నుంచి 50 పెండింగ్ స్టాప్‌నర్స్, ఇతర పోస్టుల భర్తీ నిర్వహించే అవకాశం ఉంది. వీటిని సైతం రాష్ట్రప్రభు త్వానికి ప్రతిపాదించిన అనంతరం చేపడతాం.

నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణ చర్యలేమిటి?

జోన్-4లో నర్సింగ్ నియామకాల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణపై సీరియస్‌గా దృష్టి సారించాం. దరఖాస్తుల స్క్రీనింగ్ అనంతరం నిర్వ హించనున్న కౌన్సెలింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థి సర్టిఫికెట్లను హెల్త్ యూనివర్శిటీ ఉన్నతా ధికారుల సహకారం తీసుకుంటాం. యూనివర్శిటీ అధికారులు సర్టిఫై చేసిన అనంతరం నియామకాలు చేపడతాం. దీంతో నియామకాల్లో పారదర్శకతను తీసుకొస్తాం.

దీర్ఘకాలిక రోగుల వైద్యసేవలను వివరించండి?

జ: క్రానిక్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి జీవితాల్ని అతి కష్టంగా లాగుకొస్తున్న వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలో భాగ ంగా నియామకాలు చేపడతాం. ప్రతి పిహెచ్‌సి పరిధిలో 172 రకా ల మందులను అందుబాటులో ఉంచుతాం. గుండె సంబంధిత వ్యాధుల మందులను సైతం అవసరమైన మేరకు అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుగుతోంది.

నేడు కలెక్టరేట్ ఎదుట బ్లాక్ డే నిరసన

ప్రజాశక్తి- కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష రైతు సంఘాల నాయకులు

అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు వామపక్ష కార్మిక, రైతు సంఘాల కడప జిల్లా నాయకులు నాగ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1942, ఆగస్టు 9న ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దేశం విడిచి వెళ్లి పోవాలంటే క్విట్ ఇండియా ఉద్యమం చేశారని తెలిపారు. ఆ స్ఫూర్తితో రైతుల వ్యవసాయాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పోరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్నయని తెలిపారు. బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ కార్పొరేట్స్ క్విట్ ఇండియా నినాదంతో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు పిలుపు నిచ్చిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో విత్తన వ్యాపారం అంతా మోన్ శాంటో, కార్గిల్ లాంటి బహుళ జాతి కంపెనీ చేతుల్లో ఉందని చెప్పారు. రైతులను రక్షించే విత్తన చట్టం లేదన్నారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని తెలిపారు. వసూలు చేసిన ప్రీమియంలో 80 శాతం లాభాలు పేరుతో కంపెనీలు దోచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలపై విధించే పన్నును 30శాతం నుంచి 20శాతం తగ్గించారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయ పరికరాలపై 18శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధులు కోత పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకులక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇవ్వడం ఇదేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. ఇది వికసిత్ భారత్ కాదని అన్నదాతల ఆత్మహత్యలు, అప్పుల భారతదేశం అని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నులు భారం తగ్గించి, ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు బ్లాక్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు బాదుల్లా, చంద్రారెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బద్వేల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 7 తరగతి చదువుతున్న మహిమ అనే విద్యార్థినిని ఉపాధ్యాయురాలు వసంత రాణి ఇష్టానుసారంగా కొట్టడంతో విద్యార్థిని అనారోగ్యానికి గురి అయ్యి కడప రిమ్స్ తరలించారు. వెంటనే సమాచారం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, వారి బృందం చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి గదిలో ఉన్న విద్యార్థి పాఠశాలు వింటున్న సమయంలో వేరే తరగతి గదిలోంచి వచ్చిన ఓ విద్యార్థికి అవరసమైన వస్తువులు అడుగగా తన దగ్గర లేవని చెప్పిందన్నారు. అదే తరగతిలో ఉన్న ఉపాధ్యాయురాలు చూసి తన చెప్పకుండా మీ ఇద్దరూ ఎలా మాట్లాడుకుంటారని మహిమ అనే విద్యార్థిని వెనుక వీపు భాగం పైన వంచి ఇష్టానుసారంగా కొట్టారన్నారు. దీంతో గుండె ఎక్కువగా కొట్టుకోవడంతో స్ట్రోక్ వచ్చేంత స్థితికి దారికి తీసిందని, . ఆరోగ్యం విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారని తెలిపారు. విద్యార్థి ప్రాణాలతో చలగాటం ఆడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. విద్యార్థులకు విద్యను బోధించే ఉపాధ్యాయులే ఇలా విద్యార్థులను భయభ్రాంతులకు, అనారోగ్యాలకు గురి చేస్తే భవిష్యత్తులో విద్యార్థులు ఏ విధంగా చదువుకుంటారని ప్రశ్నించారు. చదువు కునే స్వేచ్ఛను కోల్పోతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు వసంత రాణి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సభ్యులు రాజేష్, వినయ్ పాల్గొన్నారు.

ఎల్ఐసి బలోపేతం దిశగా పనిచేద్దాం

కడప ఎల్ఐసి శ్రామిక మహిళ సదస్సులో యూనియన్ జోనల్ ఉపాధ్యక్షులు కామేశ్వరి

మాట్లాడుతున్న జోనల్ ఉపాధ్యక్షులు కామేశ్వరి

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళల సమస్యలపై పాలకులు, పార్టీలు రాజకీయాలకతీతంగా స్పందించాలని ఎల్ఐసి కడప డివిజన్ శ్రామిక మహిళా సదస్సులో యూనియన్ జోనల్ ఉపాధ్యక్షులు ఎం.కామేశ్వరి అన్నారు. ఆదివారం ఎల్ఐసి శ్రామిక మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కొత్తా జూనియర్ డాక్టర్ హత్యాచారమైనా, మహిళా ప్రాతినిధ్య బిల్లు ఐనా, శ్రామిక మహిళల సమస్యల పట్ల అయినా ఆ రకమైన సమన్వయ దృష్టి, ఐక్య కార్యాచరణ లేకపోవడం వల్లనే ప్రపంచంలో మహిళల పరిస్థితి అంతర్జాతీయ ర్యాంకుల్లో వెనుకబడి ఉండడానికి కారణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసి పరిరక్షణ, సేవల విషయంలో మహిళల భాగస్వామ్యం ప్రశంస నీయ మని పేర్కొన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో యాజమాన్యపు సాను కూల ధోరణి కూడా ఇందుకు కారణమని అన్నారు. బీమా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎల్ఐసిని, తమ యూనియన్‌ను బలోపేతం చేసు కునే దిశగా కార్యచరణ భవిష్యత్తులో ఉంటుందని అన్నారు. పాలసీ దారులకు మేలు చేసేలా లైఫ్, హెల్త్ బీమా పాలసీల ప్రీమియంపై విధించిన జిఎస్‌టిని పూర్తిగా తొలగిస్తూ నవంబర్‌లో నిర్వహించే కౌన్సిల్ సమావేశం నిర్ణయి ంచాలని డిమాండ్ చేశారు. యుద్ధాలను నిరసిస్తూ, ఎల్ఐసిలో రిక్రూట్మెంట్ కోరుతూ, సమాజంలో మహిళల భద్రతపై ప్రభుత్వాలు బాధ్యతగా స్పంది ంచాలని కోరుతూ సదస్సు తీర్మానాలు చేసింది. సదస్సులో పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, ఐద్వా కన్వీనర్ సుబ్బమ్మ, అంగన్వాడి లక్ష్మీదేవి, జెవివి అరుణ, సైకాలజిస్ట్ సునీత, యూనియన్ జోనల్ నేతలు తిరుపతయ్య, శ్రీనివాసన్, డివిజన్ నేతలు అవధానం శ్రీనివాస్, రఘునాథ రెడ్డి మాట్లాడారు. సదస్సుకు కో- కన్వీనర్ వసుప్రద అధ్యక్షత వహించగా, కన్వీనర్ అమీనా పర్వీన్ ప్రవే శపెట్టిన కార్యవర్గ నివేదికను ఆమోదించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వసు ప్రద, కో -కన్వీనర్లుగా శ్రీవాణి, పద్మజాలత, శ్రీకృష్ణ, హరిప్రియ, లత, శివనందిని, లక్ష్మీదేవి, ఎన్నికయ్యారు.

'స్వర్ణాంధ్రప్రదేశ్-2047'లో అందరూ భాగస్వామ్యం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కడప

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ శివశంక్‌లోతేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు స్వర్ణ కడప దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఐదేళ్లలో జిల్లాను అభివృద్ధి చేసేలా ఆయా శాఖలు ఈనెల 30లోగా మండల విజన్ ప్రణాళికలు, అక్టోబర్ 15లోగా జిల్లా ప్రణాళికలు రూపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం మెరుగైన సేవలందించేందుకు ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని పేర్కొన్నారు. క్యూర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా 'స్వర్ణాంధ్ర-2047'పై ఆలోచనలు, సలహాలు కోరుతున్నామన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే http://swarnandhra.ap.gov.in/Suggestions ద్వారా ఇక్కడ స్కానర్ ఇమేజ్ డిస్‌ప్లే అవుతుందని, పేరు, మొబైల్ నంబర్, ఒటిపి నంబర్ ధృవీకరించని తరువాత జిల్లా పేరు, వయస్సు, వృత్తి, ఇ-మెయిల్ చిరునామాను నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఒకటి నుంచి 10 వరకు ప్రశ్నలుంటాయని, వాటిలో గరిష్టంగా 3 ప్రశ్నలను ఎంచుకోవాలన్నారు. 11వ ప్రశ్నలో ఏవైనా సూచనలు, సలహాలు నమోదు చేయాలని, తరువాత సబ్మిట్‌పై క్లిక్ చేసిన వెంటనే ముఖ్యమంత్రి సంతకంతో కూడిన సర్టిఫికెట్ జనరేట్ అవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు

చెరువుకు నీరిచ్చి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-చెన్నూరు : మండలంలోని కొండపేటలో ఉన్న చెరువుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డిని కొండపేట మాజీ సర్పంచ్ మన్నే మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఆదివారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు కెసి కెనాల్ గుండా కొండపేట చెరువుకు నీళ్లు వస్తాయని, కానీ ఈ ఏడాది నదులలో నీరు సమృద్ధిగా ఉన్నా, కెసి కెనాల్‌కు సరఫరా అవుతున్నా చెరువుకు మాత్రం నీళు వదల వదలలేదని పేర్కొన్నారు. మైదుకూరు కెసి కెనాల్‌ను కొండపేట కాలువ అనే పిలిచేవారని ఇప్పుడు ఆ కొండపేట చెరువుకే నీరు వదల్లేదని పేర్కొన్నారు. చెరువు కింద దాదాపుగా 200 ఎకరాలు సాగు భూమి ఉందని, బోర్లలో ఉన్న నీళ్లు కూడా కొద్దికొద్దిగా వచ్చి పొలాలకు నీరు సక్రమంగా అందడం లేదని వారు పేర్కొన్నారు. వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కొండపేట రైతులు పాల్గొన్నారు.

అలజడి సృష్టించిన ఎటిఎంల చోరీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల ఎటిఎంలను దొంగలు పగలగొట్టి నగదు దోచుకు వెళ్లడం అలజడి సృష్టించింది. ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. కడప నగరంలోని ద్వారకనగర్ ఎటిఎం వద్ద రూ.6,19300 లక్షల నగదు దోచుకున్నారు. ఒంటిమిట్ట ఎటిఎంలో రూ.37 లక్షల నగదు ఎత్తుకు వెళ్లారు. ఎల్ఐసి సమీపంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద ఎటీఎమ్‌ను చోరీ చేయడానికి దొంగలు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే సైరాన్ మోగడంతో వారు పరారయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నిఘా ఉన్నా, రాత్రులు గస్తీ తిరుగుతున్నా దొంగతనాలు చోటు చేసుకోవడం పట్ల ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గస్తీ మరింత పెంచాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కాకినాడలో రంగరాయ మెడికల్ కళాశాలలో స్పోర్ట్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర రావుపై దాడి చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, బి.మనోహర్, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుకునేందుకు అనుమతి ఇవ్వలేదనే కారణంతో ఎమ్మెల్యే వారి అనుచరులు దుర్మార్గంగా దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ అనుమతి తీసుకుంటే అభ్యంతరం లేదని తెలియజేసినా హెచ్‌ఒడిపై దాడి చేయడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉండి ప్రత్యక్ష దాడికి పాల్పడం సరైంది కాదని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులే ప్రజల పైన, విద్యార్థుల పైన, ఉద్యోగులపైన దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

నంద్యాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా అలీఖాన్

ప్రజాశక్తి - కడప

నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌ఛార్జిగా పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్‌ను నియమించారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైయస్ షర్మిల ఆదివారం ఉత్త ర్వులు జారీ చేశారు. శనివారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో రాష్ట్రంలోని జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిలతో ప్రత్యేకంగా పిసిసి చీఫ్ షర్మిల నేతృత్వంలో కీలక భేటీ నిర్వహించారు. ఇందులో భాగంగా మహమ్మద్ అలీఖాన్ ను నంద్యాల జిల్లా పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవిని అప్పగించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప : పేదలు, బిసి, దళితుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గుండ్లూరు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కడప నగరంలోని ఓల్డ్ రిమ్స్‌లోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో రజకుల సమావేశం నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన గుండ్లూరు శ్రీనివాసులును రజక జిల్లా సంఘం తరపున ఘనంగా సత్కరించారు. జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి, జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి మాట్లాడుతూ జిల్లాలో బీసీల ఐకమత్యంతో, రాజకీయాలకు అతీతంగా బీసీ భవన్‌ను సాధించుకోగలిగామని అన్నారు. కార్యక్రమంలో లాయర్ శ్రీనివాసులు, రాష్ట్రరజక సంఘం ఉపాధ్యక్షులు సి కృష్ణమూర్తి, రజక మహిళా నాయకులు లక్ష్మీదేవి, హేమలత, జిల్లా రజక నాయకులు కృష్ణయ్య, పిచ్చయ్య, ఏరికలయ్య, జయరాముడు, నాగేంద్ర, చెంద్రాయుడు, చంద్ర, రిమ్స్ శీను, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుండ్లూరు శ్రీనివాసులను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

పారిశ్రామికాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- కమలాపురం టౌన్



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండస్ట్రీ కారిడార్ అభివృద్ధికి కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో కేంద్రం నుంచి రూ.2 వేల కోట్లు కేటాయించి అభివృద్ధికి పాటుపడ్డారని టిడిపి మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రవీంద్రనాథ్‌రెడ్డి ఒక అభివృద్ధి పని చేయకపోగా విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. భారతీయులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డులో వాడే నెయ్యిని కల్తీ చేసి అపవిత్రం చేసి, భక్తులు మనోభావాలను దెబ్బతీసిన చరిత్ర వైసిపికే దక్కిం దన్నారు. వంద రోజుల కూటమి పాలనలో మెగా డిఎస్‌సి ప్రకటించారన్నారు. అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి రైతులను, భూ యజమానులను కాపాడిందని చెప్పారు. సమావేశంలో కమ లాపురం మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి రాఘవరెడ్డి, కాపు నాయకులు దాది రామయ్య, జిల్లా బిసి ఉపాధ్యక్షులు శంకర్ యాదవ్, బొయిల్ల శంకర్ రెడ్డి , పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక శ్రీమరకత వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి 13వరకు ఉత్సవాలు అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 12న అమ్మవారికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు లింగం పట్టాభి రామయ్య, వైస్ ప్రెసిడెంట్ యాదల్ల రామకృష్ణ, సెక్రటరీ దేవతి రాము, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పంపిణీకి నోచని ప్లాస్టిక్ డబ్బాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద ప్రభుత్వం గ్రీన్, ఎల్లో ప్లాస్టిక్ డబ్బాలను ఇంటింటికి పంపిణీ చేయాలని ఆదేశించింది. గత సార్వత్రిక ఎన్నికల సమయం ముందే వీటిని ఆయా పంచాయతీలకు సరఫరా చేసింది. ప్రతి ఇంటికి ఒకటి ఎల్లో, మరొకటి గ్రీన్ ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేసి వాటిలో తడిపొడి చెత్త వేసేలా ప్రజలకు అవగాహన కల్పించి ఇవ్వాల్సి ఉంది. అయితే చాలా పంచాయతీలలో కుటుంబాలకు సరి పడా

గురజాల సచివాలయంలో ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు

ప్లాస్టిక్ డబ్బాలు ఇవ్వని కారణంగా పంపిణీ చేయలేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. ఈ డబ్బాలు చాలా పంచాయతీ సచివాలయాల్లో అలంకారప్రాయంగా మిగిలాయి. అధికారులు చర్యలు తీసుకొని త్వరితగతిన పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ ఎఇ బదిలీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం విద్యుత్ శాఖ ఎఇ సుబ్రమణ్యం రైల్వేకోడూరు టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఆదివారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ ఇంజనీర్ వినోద్‌ను కలసపాడుకు బదిలీ చేశారు. మండలానికి సంబంధించి ఎఇ, ఎస్ఇ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇన్‌ఛార్జిగా వేముల సబ్ ఇంజనీర్ దినేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

రఘురామ కృష్ణంరాజు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు వెంటనే రాజీనామా చేయాలని జిల్లా మాల మహానాడు యూత్ ప్రెసిడెంట్ తిట్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రఘురామ కృష్ణంరాజు ఒక ప్రజా ప్రతినిధిగా సమాజంలో ఉండడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. ఆయన ప్రజాప్రతినిధి కావడానికి భారత రాజ్యాంగం ద్వారానే అయ్యాననే విషయాన్ని మర్చిపోయినట్లు ఉన్నారన్నారు. భారతదేశానికి ఒక దశ దిశను నిర్ణయించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని అక్కడ నుండి తొలగించడం వంచనకరమన్నారు. అక్కడ ఏదైనా పొరపాటు జరిగి ఉంటే దానికి ఒక చట్టం ఉంటుందని, ఆ ప్రకారం తొలగించాలన్నారు. తక్షణమే ఆయనను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండి పుల్లయ్య, భూమిరెడ్డి చిన్న మాధవయ్య పాల్గొన్నారు.

కేక్ తినిపిస్తున్న తొండూరు వేణు

ఘనంగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా తొండూరు వేణు ఆధ్వర్యంలో ఆదివారం పులివెందుల అంకాలమ్మ గుడి దేవస్థానంలో పూజలు నిర్వహించి, శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శరత్, రవి, మల్లేష్, మాబాషా, ఇమ్రాన్, శుభహన్, అభిమానులు, ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామమోహన్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పల్లవోలు అనాథాశ్రమంలో ఆదివారం ఖాజీపేట మండలం బి.కొత్తపల్లెకు చెందిన తవ్వా సోమయ్యగారి ఓబుల్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు ఓబుల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. దాదాపు 50మందికి అన్నదానంతోపాటు పండ్లు, స్వీట్లు అంజేశారు. ఓబుల్‌రెడ్డి సతీమణి ఈశ్వరమ్మ, ఆయన కుమారులు సుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కూతురు లక్ష్మీదేవి, అల్లుడు శ్రీనివాసులరెడ్డి, మనువళ్లు, మనవరాళ్లు, ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య, వృద్ధులు పాల్గొన్నారు.

పల్లవోలు అనాథాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేసిన దాతలు

మార్కెట్‌కు స్థల కేటాయింపు ఎన్నడో..!

ప్రస్తుతం కొనసాగుతున్న కూరగాయల మార్కెట్

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు స్థల కేటాయింపు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు మండల పరిధిలో టమోటా, పచ్చిమిర్చి ఇతర కూరగాయలు, ఆకుకూరలు సాగును రైతులు అధికంగా చేపడతారు. వాటి అమ్మ కోసం మైదుకూరు, ప్రొద్దుటూరు తరలిస్తారు. అయితే మైదుకూరులోని వనిపెంట రోడ్డులో ప్రస్తుతం మార్కెట్ కొనసాగుతోంది. అయితే మార్కెట్‌కు ప్రత్యేకస్థలం కేటాయింపు లేకపోవడంతో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. అంకాలమ్మ గుడి సమీపంలో అమ్మకాలు రైతులు చేపడుతున్నారు. గత ప్రభుత్వంలో పశువుల సంతను గగ్గి తిప్ప వద్దకు మార్చి, పశువుల సంత స్థానంలో కూరగాయల మార్కెట్ గదులను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. అయితే అవి పూర్తి కాకపోవడం, నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ సంతను మార్పు చేయడం వంటి పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్ స్థల కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి దుకాణాలను ఏర్పాటు చేస్తే అటు రైతులకు, వ్యాపారులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల మార్పులు మైదుకూరులో చేపట్టారు. కూరగాయల మార్కెట్‌కు కూడా స్థలాన్ని కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్‌కు గానీ, వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలకు నిలుపుకునే స్థలం పార్కు స్థలం ఎలాంటి ఏర్పాట్లు లేవు. ప్రజల మీద మాత్రం మున్సిపాలిటీ పన్ను అధికంగా వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల వస్తువులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పులివెందులలో భారీ చోరీ

750 గ్రాముల బంగారు, రెండున్నర కిలోల వెండి, రూ. లక్ష నగదు అపహరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల కడప రోడ్డులో ఉన్న విజయహోమ్స్‌లో హరిప్రియ గ్యాస్ ఏజెన్సీ యజమాని హరి నివాసంలో భారీ చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. శనివారం వ్యక్తిగత కారణాలతో హరి తన కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. కాపు కాసిన దొంగలు శనివారం అర్ధ రాత్రి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారు, వెండి, నగదు దోచుకు వెళ్లారు. ఆదివారం ఉదయం చుట్టుపక్కల వారు

బీరువాలో చెల్లాచెదురైన వస్తువులు

తలుపులు పగలగొట్టి ఉండడంతో వెంటనే ఇంటి యజమాని హరికి ఫోన్ చేశారు. ఆయన తన బంధువులను అక్కడికి పంపించారు. ఇంట్లో ఉన్న వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సిఐ జీవన్ రంగనాథ్ బాబు సిబ్బందితో అక్కడికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. యజమాని హరితో ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటిలో ఏమేం వస్తువులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన వివరాల మేరకు 750 గ్రాముల బంగారు, రెండున్నర కిలో వెండి, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దించారు.

దొంగతనాలు అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం : డిఎస్‌పి

హరి ఇంట్లో దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న డిఎస్‌పి మురళి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేకదృష్టి పెట్టామని, నైట్ బీట్లను కూడా పెంచామని తెలిపారు. దొంగతనాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అన్ని చర్యలు చేపట్టామని డిఎస్‌పి వివరించారు. హరి ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి మురళి

ప్రజలకు చేరువవుతున్న ఎమ్మెల్సీ పిఆర్

కొండాపురం మండల సీనియర్ నాయకులు గండ్లూరు నారాయణరెడ్డి

ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న ఎమ్మెల్సీ పిఆర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కొండాపురం రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి (పిఆర్) యాక్టివ్ పాలిటిక్స్ చేస్తుండడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయని కొండాపురం మండల సీనియర్ నాయకులు గండ్లూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. ముఖ్యంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో గత పాతికేళ్లుగా పొన్నపురెడ్డి వర్సెస్ దేవగుడి అనే విధంగా రాజకీయాలు నిర్వహించారు. అయితే 2019 ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా సుధీర్‌రెడ్డి వైసిపి తరపున, టిడిపి నుంచి పి.రామసుబ్బారెడ్డి బరిలో నిలిచారు. అనూహ్యంగా సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాలతో పిఆర్ వైసిపి గూటికి చేరారు. అనంతరం వైసిపి అధిష్టానం ఆయనకు ఎమ్మెల్సీతో సముచిత స్థానం కల్పించింది. అయితే 2024 ఎన్నికల బరిలో దేవగుడి వర్సెస్ సుధీర్‌రెడ్డి నిలిచారు. ఈ ఎన్నికలలో దేవగుడి ఆదినారాయణరెడ్డి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో వైసిపిలో ఆశించిన స్థాయిలో కార్యకర్తలకు క్యాడర్ అందుబాటులో లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో పిఆర్ నేనున్నానంటూ ప్రజలకు చేరువయ్యారు. ఇటీవల తన క్యాడర్‌కు సంబంధించి కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులున్నా వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు. నిరంతరం తన కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో పరిష్కారం చూపుతున్నారు. ముఖ్యంగా కొండాపురం మండలంలో అన్ని గ్రామాల ప్రజలతో నిరంతరం వారితో మమైకవుతున్నారని నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యకర్తలకు సంబంధించిన చిన్నపాటి శుభకార్యక్రమాన్ని నిర్వహించినా ఆయన హాజరవుతూ నిరంతరం ప్రజల్లో ఉంటున్నారు. వైసిపి కార్యకర్తలకు నేనున్నానంటూ తనదైన శైలిలో వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. దీంతో క్యాడర్ నూతన ఉత్సాహంతో ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పాటుపడాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా పాటుపడాలని మైదుకూరు నియోజకవర్గం ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు బద్వేలి రామకృష్ణారెడ్డి కోరారు. మైదుకూరులోని శ్రీవాసవి హైస్కూల్‌లో ఆదివారం ప్రయివేట్ పాఠ శాలల యాజమాన్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని 24 మంది కరస్పాండెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు నేడు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు సంఘటితం కావాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. **ఎన్నికైన కార్యవర్గం సభ్యులు..** గౌరవ అధ్యక్షులుగా డి.వేణుగోపాల్ రెడ్డి (శ్రీగాయత్రి హైస్కూల్), టి.వెంకటేశ్వర్లు (టీవీఎస్‌ఎం స్కూల్), పి.వసుంధర దేవి (శారదా స్కూల్), గౌరవ సలహాదారులుగా ఇవి రమణారెడ్డి (వరుణ్ హైస్కూల్), అధ్యక్షులుగా డాక్టర్ టి.సుధాకర్ రెడ్డి (రెయిన్‌బో స్కూల్), జనరల్ సెక్రటరీగా బి.నాగేశ్వర్‌రెడ్డి (శ్రీ స్వామి వివేకానంద విద్యానికేతన్), ట్రెజరర్‌గా ఎ.ఆంజనేయులు (శివ చైతన్య హైస్కూల్), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టి.సాయి ఓబుల్‌రెడ్డి (శ్రీసాయి స్కూల్), బి.రామకృష్ణారెడ్డి (వాసవి స్కూల్), ఉపాధ్యక్షులుగా ఎం.రామ్మోహన్‌రెడ్డి (శంకరాచార్య హైస్కూల్), ఎం.గురుస్వామి యాదవ్ (లిఖిత హైస్కూల్), ఉప కార్యదర్శులుగా ఎంఎస్ మహబూబ్ బాషా (సాయికృప స్కూల్), ఎస్.రాజేశ్వరి (సాయి తేజ హైస్కూల్)ని ఎన్నుకున్నారు. వీరు రెండేళ్లపాటు ఆ పదవిలో ఉంటారు.

సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డి

వరద బాధితులకు సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కడప సిటీ

విజయవాడ వరద బాధితులకు దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చీరలతో కూడిన సామగ్రి పంపిణీ చేశామని దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఆయి ల్‌మిల్ ఓబులేసు, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదాయదుల్లా పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని ముంపు ప్రాంతాలైన పాత రాజరాజేశ్వరిపేట, గొల్లపూడి, బొమ్మసాని సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో పర్యటించిద చెప్పారు. బాధితుల ఇబ్బందులు కదిలిచాయని తెలిపారు. అనంతరం తమ వంతు సహాయంగా వస్తు సామగ్రిని పంపిణీ చేశామన్నారు. ఇటువంటి విపత్తుల సమయాల్లో దాతృత్వం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ ఖాదరయ్య, టీచర్ అజ్మతుల్లా, మంటపంపల్లి బాషా, రాయలసీమ ఉపాధి హామీ మాజీ కమిషనర్ పోతుగంటి పేరయ్య, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

కాలువలో పారుతున్న కృష్ణా జలాలు

చెరువులకు చేరుతున్న కృష్ణా జలాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గంలోని సింహాద్రిపురం తొండూరు, పులివెందుల మండలాలకు ప్రధాన సాగునీటి వనరు పైడిపాలెం రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలతో చెరు వులను నింపుతున్నారు. పైడిపాలెం రిజర్వాయర్ నుంచి మల్లెల, గంగనపల్లె, సంతకోవూరు చెరువులను నింపు తు న్నారు. రిజర్వాయర్ సామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.8 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు జీకేఎల్ఐ డిఇ శ్రీని వాసులు తెలపారు. రిజర్వాయర్‌లోకి గండికోట నుంచి ఏడు మోటర్ల సహాయంతో 770 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే మల్లెల, హిమకుంట్ల కాలువలకు 150 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని టివి టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. ఆదివారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ లో కడప సిటీ టివి టెక్నీషియన్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టివి మెకానిక్స్ ట్రేడ్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ టెక్నీషియన్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. చంద్రన్న కానుక పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అందరికీ ఇళ్లు, ఇళ్ళ స్థలాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హరిక్రిష్ణ, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, సిటి ప్రెసిడెంట్ సలీం, జిల్లా కార్యదర్శి బహుద్దీన్ మాట్లాడుతూ ఎవరికీ ఏ సమస్య వచ్చినా ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. తాము స్కిల్ డెవలప్మెంట్ క్రింద ట్రైనింగ్ కోసం దరఖాస్తు చేశామని, అయితే అంతలో ఎన్నికల కోడ్ రావడంతో నిలిచి పోయిందని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో సిటి సెక్రటరీ మురళి,ట్రెజరర్ నాగ మునెయ్య పాల్గొన్నారు.

In the Court of the Hon'ble Senior Civil Judge at kadapa
O.S.NO. 419/2018
Padidham Nagaraju ....Petitioner / Plaintiff
Vs
Chintaginjala Vijaya@Vijayalakshmi is died her LRS Chintaginjala Sreenivasulu and 4 others.
.....Respondent/Defendant
Notice to Respondent No: 2 to 5
2. Chintaginjala Sreenivasalu, S/o. C. Subbarayudu, age 58 years,
3. Chintaginjala Anil, S/o C. Sreenivasulu, age 35 years
4. Chintaginjala Himabindu,W/o Husband name not known, age 30 years
5. Chintagingale Ram Charan, S/o. C. Sreenivasulu, age 13 years, Minor Natural Guardian father by name Chintaginjala Sreenivasulu All are residing at D.No.- 18/548, BKM Street, Kadapa City, YSR district.
పై దావాలోని petitioner ప్రతివాదులైన మీ పై దావా వేసియున్నారు. సదరు దావాలో నోటీసులు మీకు ముట్టనందున కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలుపమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నయెడల 25-09-2024వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టునందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపవలెను. లేనియెడల నీ పరోక్షము నందు తీర్మానించబడును.
" కోర్టు వారి ఉత్తర్వుల మేరకు "
Chavva Siva Prasad Reddy ,
Advocate, Kadapa.

మోడీ, చంద్రబాబు పాలనలో పెరిగిన ధరలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్.తులసిరెడ్డి

కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగి పోయాయని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచడం ద్వారా వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పామాయిల్ మీద దిగుమతి సుంకాన్ని 27.5 శాతం విధించడం ద్వారా ఒక లీటరుపై అదనంగా రూ.20 పెరిగిందన్నారు. సన్‌ఫ్లవర్‌పై దిగుమతి సుంకాన్ని 13 శాతం నుండి 35.5 శాతానికి పెంచడం ద్వారా ఒక్క లీటర్‌పై రూ.39 పెరిగిందన్నారు. కందిపప్పు ధర కొండెక్కి కూర్చుందని పేర్కొన్నారు. కిలో కంది రూ.160 నుంచి రూ.173కు పెరిగిందని తెలిపారు. ఎండు మిర్చి కిలో ధర రూ.180 నుంచి రూ.220, వెల్లుల్లి రూ.240 నుంచి రూ.400కు, చింతపండు రూ.110 నుంచి రూ.140కు పెరిగినట్లు చెప్పారు. వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత భారత్ అంటారా లేక విషాద భారత్ అంటారో ప్రధాని మోడీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కూడా దీన్ని మంచి ప్రభుత్వం అంటారా లేక ముంచే ప్రభుత్వం అంటారో సమాధానం చెప్పాలని కోరారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు ఇద్దరూ వట్టి మాటలు కట్టిపెట్టి ధరల నియంత్రణ మీద దృష్టి పెట్టాలని కోరారు.

బాబోయ్.. ఇసుక దొంగలున్నారు జాగ్రత్త..!

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఇంటి నిర్మాణం కోసం తోలుకున్న ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలిస్తున్నారు. దీంతో ఇంటి నిర్మాణ యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దుల బండ్ల ద్వారా ఇంటి నిర్మాణాల కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఇసుకను ఇంటి యాజమానులు తోలుకున్నారు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు దుండగులు రాత్రి సమయంలో ఇంటి నిర్మాణాల వద్ద ఉన్న ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని, పగలు వచ్చి చూస్తే ఇసుక లేకపోవడంతో కూలీలు వెనుదిరగాల్సి వస్తోంది. ఇంటి నిర్మాణం చేపట్టిన యాజమానులు భయాందోళనకు గురవుతున్నారు. రాయచోటి-పులివెందుల బైపాస్ రోడ్డులో మౌలా అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం నాలుగు ట్రాక్టర్లు ఇసుకను తోలించుకున్నాడు. ఆ ఇంటి వద్ద ఉన్న ఇసుకను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ట్రాక్టర్లు ద్వారా తరలించినట్లు బాధితుడు మౌలా వాపోయాడు. ఇసుక దొంగలించడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదని, ఈ పరిస్థితి కొద్దిరోజుల నుంచి జరుగుతోందని వాపోతున్నారు. వేంపల్లె చరిత్రలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలించకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి ముందు ఉన్న ఇసుకను తరలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు సిద్ధపడుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఇంటి నిర్మాణ యజమానులు కోరుతున్నారు.

సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్ద రంగాపురం గ్రామంలో జరిగిన అంకాలమ్మ జాతర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులిచ్చిన విందులో ఆయన పాల్గొన్నారు. పలువురు గ్రామ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎమ్మెల్సీ స్పందిస్తూ సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం వందరోజుల మంచి పాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. తద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు.

సిఎం సహాయనిధికి విరాళాలివ్వడం అభినందనీయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు ఆర్థికసాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ బిటి నాయుడు, టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పులివెందుల పట్టణానికి చెందిన ఒంటెద్దు మల్లికార్జున రెడ్డి రూ.50 వేలు, ఒంటెద్దు చంద్రశేఖర్‌రెడ్డి రూ.50,116 విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వరద సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వానికి అండగా నిలుస్తూ విరాళాలివ్వడం హర్షణీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు దాతలు పెద్ద సంఖ్యలో ముందుకొచ్చి ప్రభుత్వానికి అండగా నిలవాలని వారు కోరారు.

బీటెక్ రవి, నాయుడుకు చెక్కును అందజేస్తున్న ఒంటెద్దు సోదరులు